సాక్షి విజయనగరం

గురువారం, 9, ఫిబ్రవరి, 2023



'ఎగ్'వేత కుదరదిక..!

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కోడిగుడ్ల పంపిణీ ఒకప్పుడు అవకతవకలకు కేంద్ర బిందువుగా ఉండేది. ప్రభుత్వ చర్యలతో ఇప్పుడు అక్రమాలకు అడ్డుకట్టపడింది.

- 8లో



ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

ప్రయాణికులతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి బొబ్బిలి మండలం కోమటిపల్లి వద్ద బోల్తా కొట్టింది. ప్రమాదంలో ఆరుగురు గాయపడ్డారు. ఆటో పూర్తిగా పాడైంది.

- 8లో



రీ సర్వే పక్కాగా నిర్వహించాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే పక్కాగా నిర్వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ కోరారు.

- 8లో

న్యూస్‌రీల్

ఉత్తరాంధ్రస్థాయి నాటక పోటీలకు ఆహ్వానం



నాటక పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్వీఆర్ కళాపరిషత్ సభ్యులు

రాజాం సిటీ: సలాది వెంకటరమణ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉత్తరాంధ్రస్థాయి నాటక పోటీలు నిర్వహించనున్నట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సలాది తులసీదాస్, ఆర్నెపల్లి వెంకటనాయుడు తెలిపారు. పోలిపల్లి పైడితల్లి ఆలయ ఆవరణలో నాటక పోటీల కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా పైడితల్లి జాతరను పురస్కరించుకుని నాటకాల్లోని పలు సన్నివేశాల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పౌరాణిక, జానపద, సాంఘిక, ఏకపాత్రాభినయంలలో పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతితోపాటు ప్రదర్శన పారితోషకం అందిస్తామని చెప్పారు. ఆసక్తి కలిగిన కళాకారులు ఈ నెల 15లోగా ఎంట్రీలను ఆర్నిపల్లి వెంకటనాయుడు, ప్రధాన కార్యదర్శి, ఎస్వీఆర్ కళాపరిషత్, అమ్మవారికాలనీ చిరునామాకు పంపించాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్: 94417 56874 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

తలలేని దూడ జననం



తలభాగం లేని ఆవుదూడ

సీతంపేట: మండలంలోని కొత్త పనుకువలసలో ఎస్.తిరుపతిరావు అనే రైతుకు చెందిన ఆవు తలభాగం లేని దూడకు బుధవారం జన్మనిచ్చింది. భూమిపై పడిన వెంటనే చనిపోయిందని రైతు తెలిపారు. జన్యుపరమైన లోపాలు కారణంగా తలభాగం తయారు కాలేదని స్థానిక పశుసంవర్ధకశాఖ ఏడీ శ్రీనివాసరావు తెలిపారు.

క్షయరోగుల గుర్తింపు

- జిల్లా క్షయ నివారణ అధికారి రామేశ్వరిప్రభు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా క్షయ నివారణ అధికారి రామేశ్వరి ప్రభు

విజయనగరం ఫోర్ట్: క్షయరోగులను త్వరగా గుర్తించి చికిత్స అందించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని తగ్గించవచ్చని జిల్లా క్షయ నివారణ అధికారి రామేశ్వరి ప్రభు అన్నారు. స్థానిక జిల్లా క్షయనివారణ శాఖ కార్యాలయంలో సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధానమంత్రి యుక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ రోగులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వారికి కఫం పరీక్ష చేయాలన్నారు. కార్యక్రమంలో కుమార్, నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు



మెరకముడిదాం పీహెచ్‌సీలో మందుల నిల్వలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌ఓ

మెరకముడిదాం: రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని మెరకముడిదాం, గర్భాం పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బందిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.వి.రమణకుమారి ఆదేశించారు. ముందుగా మెరకముడిదాం పీహెచ్‌సీలో ఓపీ తగ్గడంపై ఆరా తీశారు. మందుల నిల్వలను పరిశీలించారు. విధులకు హాజరుకావడం, సేవలు అందించడంలో అలక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గర్భాం పీహెచ్‌సీని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సాంభమూర్తి, అనిల్‌కుమార్ రెడ్డి, అజయ్‌కుమార్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

● ఘటోత్సవం



పారాదిలో ఘటాలకు పూజలు చేస్తున్న భక్తులు

బొబ్బిలి మండలం పారాది గ్రామంలో ఘటోత్సవానికి బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ నెల 28న మండలంలోని 13 గ్రామాల్లో పాతపోలమ్మ, కొత్తపోలమ్మ, నూకాలమ్మ జాతరలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 28 వరకు ఆయా గ్రామాల్లో ఘటాలను ఊరేగించి పూజలు చేస్తామని గ్రామపెద్దలు తెలిపారు.

- బొబ్బిలి రూరల్

● వ్యాక్సినేషన్

జీవాలకు పీపీఆర్ వ్యాధి సోకుండా వ్యాధినిరోధక టీకాలు వేసే ప్రక్రియ జిల్లాలో చురుగ్గా సాగుతోంది. సచివాలయ ఏహెచ్‌ఏలు, పశువైద్య సిబ్బంది పొలాలకు వెళ్లి మందలుగా ఉన్న జీవాలకు వ్యాక్సిన్లు వేస్తున్నారు. వ్యాక్సిన్లు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలను జీవాల పెంపకందారులకు వివరిస్తున్నారు. మూడు రోజుల్లో 12 శాతం వ్యాక్సినేషన్ పూర్తిచేసినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వై.వి.రమణ తెలిపారు.

- తెర్లాం



నెమలాంలో గొర్రెలకు వ్యాక్సిన్ వేస్తున్న సచివాలయ ఏహెచ్‌ఏలు

పరిశ్రమలపై రాయితీల జల్లు





- ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమలకు ప్రభుత్వ సాయం
- ఏటా రూ. 80 కోట్ల వరకు రాయితీ
- జిల్లాలో 11 ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమలు
- ఏడాదికి 2400 మిలియన్ యూనిట్స్ వినియోగం

పరిశ్రమల ఆర్థిక వృద్ధికి దోహదం

ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమలకు ప్రభుత్వం విద్యుత్‌ను రాయితీపై సరఫరా చేస్తోంది. ఏడాదికి రూ.77.93 కోట్ల విలువైన విద్యుత్‌ను రాయితీపై సరఫరా చేస్తున్నాం. ఇది పరిశ్రమల ఆర్థిక వృద్ధికి దోహదపడుతుంది.

– పి.నాగేశ్వరరావు, విద్యుత్‌శాఖ ఎస్ఈ

విజయనగరం ఫోర్ట్:

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడంతో పాటు ఉన్న పరిశ్రమలకు ఆర్థిక ఊతం అందిస్తోంది. రాయితీల జల్లు కురిపిస్తోంది. చిన్న, మధ్య, పెద్ద తరహా పరిశ్రమలకు విద్యుత్‌ను రాయితీపై సరఫరా చేస్తోంది. బిల్లుల భారం తగ్గించి అధిక ఉత్పాదకతకు తోడ్పాటునందిస్తోంది. జిల్లాలో సగానికిపైగా విద్యుత్‌ను వినియోగించే ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమల ఆర్థిక వృద్ధికి విద్యుత్ రాయితీలు ఉపయోగపడుతున్నాయి.

పరిశ్రమలు ఇలా..

జిల్లాలో 11 ఫెర్రోఎల్లాయీస్ పరిశ్రమలు ఉన్నాయి. ఫేకర్ ఎల్లాయీస్ లిమిటెడ్, హిరఎలక్ట్రో స్మెల్టర్స్ పీవీటీ లిమిటెడ్, ఆంజనేయ ఫెర్రో ఎల్లాయీస్ లిమిటెడ్, మీడీఏ మినరల్ దాతు ప్రైవేట్ లిమిటెడ్, మోరో ఎల్లాయీస్ పీవీటీ లిమిటెడ్, సిరి స్మెల్టర్స్ ఎనర్జీపీవీటీ లిమిటెడ్, జిందాల్ స్టేషనల్స్ లిమిటెడ్, ఆరో శ్రీ వెంకటేశ్వర స్వామి స్టీల్స్, డెక్కన్ ఫెర్రో ఎల్లాయీస్ లిమిటెడ్, శ్రీ మహలక్ష్మి స్మెల్టర్స్ పీవీటీ లిమిటెడ్, బెర్రా ఎల్లాయీస్ లిమిటెడ్ పరిశ్రమలు ఉన్నాయి.

ఏడాదికి రూ.80 కోట్ల వరకు రాయితీ

ఫెర్రోఎల్లాయీస్ పరిశ్రమలకు ప్రభుత్వం ఏడాదికి రూ. 80 కోట్లు వరకు విద్యుత్ రాయితీ కల్పిస్తోంది. ఏడాదికి జిల్లాలో అన్ని రకాల విద్యుత్ కనెక్షన్లకు కలిపి 3,252 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం అవుతోంది. వీటిలో ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమలు 2,400 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగిస్తున్నాయి. 852 మిలియన్ యూనిట్లు మిగతా విద్యుత్ వినియోగదారులు వినియోగిస్తున్నారు.

విద్యుత్ రాయితీ ఇలా...

పరిశ్రమ	రాయితీ రూ.కోట్లలో
ఫెర్రో ఎల్లాయీస్ లిమిటెడ్	20.26
హిర ఎలక్ట్రోస్మెల్టర్స్	5.78
ఆంజనేయ ఫెర్రో ఎల్లాయీస్	7.84
ఎండి మినరల్‌ధాతు లిమిటెడ్	2.95
మోరో ఎల్లాయీస్ పీవీటీ లిమిటెడ్	5.79
సిరి స్మెల్టర్స్ఎనర్జీ లిమిటెడ్	1.91
జిందాల్ స్టెయిన్‌లెస్	8.26
ఎ.ఎస్.వి.స్వామి స్టీల్స్	3.36
డెక్కన్ ఫెర్రో ఎల్లాయీస్	7.11
శ్రీ మహలక్ష్మి స్మెల్టర్స్	3.07
బెర్రా ఎల్లాయీస్	11.55

వసతిగృహ విద్యార్థులకు హెల్త్‌కార్డులు

- బీసీ సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్నది 85,300 మంది
- రాష్ట్రంలో 365 వసతి గృహాల్లో నాడు–నేడు పనులు
- రాష్ట్ర బీసీ వెల్ఫేర్ కమిషనర్ పడాల అర్జునరావు



విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ సంక్షేమ కమిషనర్, సహాయ కమిషనర్

కొత్తవలస: రాష్ట్రంలో బీసీ సంక్షేమ వసతి గృహాల్లో 85,300 మంది విద్యార్థులు చదువుతున్నారని, వీరందరికీ త్వరలో హెల్త్‌కార్డులు మంజూరు చేస్తామని కమిషనర్ పడాల అర్జునరావు తెలిపారు. కొత్తవలస బీసీ వసతిగృహాన్ని సహాయ కమిషనర్ చంద్రశేఖరరాజుతో కలిసి బుధవారం సందర్శించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 1109 బీసీ సంక్షేమ వసతిగృహాలు ఉన్నాయన్నారు. 660 వసతిగృహాలకు సొంతభవనాలు ఉండగా, మిగిలినవి ఫ్రీరెంట్, ఇతర శాఖలకు చెందిన భవనాలు, అద్దె భవనాల్లో నడుస్తున్నాయని చెప్పారు. ఇందులో 747 ప్రీమెట్రిక్ హాస్టల్స్, 362 పోస్టు మెట్రిక్ హాస్టల్స్ ఉన్నాయని తెలిపారు. కేవలం బాలికల కోసం ప్రీ మెట్రిక్ హాస్టల్స్ 188, పోస్టుమెట్రిక్ హాస్టల్స్ 180 ఉన్నట్లు వెల్లడించారు. వీటిల్లో మొత్తంగా లక్షా26వేల మందికి ప్రవేశ అవకాశాలు ఉన్నా, ప్రస్తుతం 85,300 మంది విద్యార్థులే ఉంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో 365 వసతి గృహాల ఆధునికీకరణకు నివేదికలను ప్రభుత్వానికి పంపించామన్నారు. విజయనగరం జిల్లాలో కొత్తవలస బాలికల హాస్టల్‌ను ఎంపిక చేశామన్నారు. మెనూ చార్జీలు పెంచే యోచనలో ప్రభుత్వం ఉందన్నారు. విద్యార్థులకు కాస్మోటిక్స్ చార్జీలను ప్రతీనెల తల్లి బ్యాంకు ఖాతాలో జమచేస్తున్నట్టు వివరించారు.

నావల్‌బేస్ ఏర్పాటుకు సహకరించండి



బాడంగి తహసీల్దార్‌తో చర్చిస్తున్న విశాఖ నావికా దళాధికారులు

బాడంగి: బాడంగి విమానాశ్రయం వద్ద నావల్ బేస్ ఏర్పాటుకు రక్షణ శాఖకు చెందిన స్థలంతో పాటు అదనంగా మరో 1200 ఎకరాలను సేకరించాలని విశాఖ నావికాదళ అధికారులు తహసీల్దార్ బాలమురళీకృష్ణను కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సుబ్బారావుతో పాటు మరో ఇద్దరు నావికాదళ అధికారులు బుధవారం రెండు గంటలపాటు తహసీల్దార్‌తో సుదీర్ఘంగా చర్చించారు. గతంలో రక్షణశాఖకు చెందిన భూముల మ్యాప్‌తో పాటు అవసరమైన భూములు, అందులోకి వస్తున్నగ్రామాల వివరాలను తెలియజేశారు. రక్షణదళానికి చెందిన సుమారు 264 ఎకరాల భూమి ఇప్పటికే గచ్చురోడ్డుతో కలుపుకొని ఉందని, వాటికి అదనంగా 1500 మీటర్ల వెడల్పు, 3000 మీటర్ల పొడవుతో దీర్ఘచతురస్రాకార కొలతలతో భూములు అవసరమని చెప్పారు. భూములిచ్చేందుకు కొంతమంది రైతులు ముందుకు రాకపోవచ్చని తహసీల్దార్ సందేహం వ్యక్తంచేశారు. అయితే, రక్షణశాఖకు అవసరమైనందున ప్రత్యేక భూసేకరణ కింద ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఉన్న భూములు కాకుండా ప్రభుత్వ, ప్రైవేటు భూములు సేకరించాలని కోరారు. ఆర్ఓఆర్ చట్ట ప్రకారం భూముల క్రయవిక్రయాల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందన్నారు. ఈ ప్రాంతంలో నావల్‌బేస్ ఏర్పాటైతే నిరుద్యోగులకు ఉద్యోగాలతో పాటు ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని కొందరు పేర్కొనగా, ఇప్పటికే చాలాసార్లు అధికారులు వచ్చి వెళ్లారే తప్ప పనులు కార్యరూపం దాల్చలేదని మరికొందరు చెబుతున్నారు.

బాలికల ఆరోగ్యంపై ఆరా



విద్యార్థులతో ఏకాంతంగా మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి



బాలికల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, తదితరులు

కొత్తవలస: మండల కేంద్రంలోని బీసీ బాలికల హాస్టల్‌ను రాష్ట బీసీ వెల్ఫేర్ కమిషనర్ పడాల అర్జునరావు, సహాయ కమిషనర్ డి.చంద్రశేఖరరాజు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, సహాయ బీసీ వెల్ఫేర్ అధికారి ఎ.శ్యామలతో పాటు కలెక్టర్ ఎ.సూర్యకుమారి బుధవారం పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. హాస్టల్‌లో మంగళవారం ఆహారం వికటించడంతో 14 మంది అస్వస్థకు గురైన ఘటన తెలిసిందే. కాగా బుధవారం రాత్రి మరో 9 మంది బాలికలు అస్వస్థకు గురికావడంతో 108 వాహనంలో ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. హాస్టల్ భవనం పాతది కావడం, హాస్టల్‌కు హైస్కూల్‌కు మధ్య సుమారు 2 కిలోమీటర్ల దూరం ఉండడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని, పాఠశాల సమీపంలో భవనం చూసి అక్కడికి మారుస్తామని కలెక్టర్ తెలిపారు. తాగునీరు, మరుగుదొడ్లు, దోమ తెరల సమస్యలు పరిష్కరించాలని వార్డెన్ శ్రీదేవి కోరారు. జిల్లా బీసీ సంక్షేమ అధికారి యశోధనరావు, సీఐ బాలసూర్యారావు, సీఎస్‌డీటీ రమేష్, నాయకులు ఒబ్బిన నాయుడు, కె.శ్రీను, రామస్వామి పాల్గొన్నారు.

38 మంది విద్యార్థులకు అస్వస్థత

- ఉడికీఉడకని ఆహారం తినడంతో.. కోనయూపీ పాఠశాలలో ఘటన
- స్పందించిన డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర
- పాఠశాలకు చేరుకున్న ఇన్‌చార్జి డీఈఓ, డీఎంహెచ్ఓ
- విద్యార్థులకు మక్కువ పీహెచ్‌సీలో వైద్యసేవలు
- కోలుకుంటున్న విద్యార్థులు



108 వాహనంలో మక్కువ పీహెచ్‌సీకు తరలిస్తున్న వైద్యసిబ్బంది

మక్కువ: మక్కువ మండలం కోన గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఉడికీఉడకని వెజ్‌బిరియానీ, కలుషిత నీరు తాగిన 38 మంది విద్యార్థులు బుధవారం అస్వస్థతకు గురయ్యారు. కొందరు కడుపునొప్పితో బాధపడ్డారు. సమాచారం తల్లిదండ్రులకు తెలియడంతో ఆందోళనకు గురయ్యారు. పాఠశాల వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. విషయం ఫోన్‌లో తెలుసుకున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర సూచనలతో ఇన్‌చార్జి డీఈఓ బ్రహ్మాజీరావు, డీఎంహెచ్ఓ జగన్నాథరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ వెంకటరమణ, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ భాస్కరరావు, తహసీల్దార్ సూర్యనారాయణ, ఎంపీడీఓ పి.దేవకుమార్, ఎస్ఐ జి.పైడిరాజు సైతం పాఠశాలకు చేరుకున్నారు. ఏడు 108 వాహనాలు, ఒక 104 వాహనం, ఆటోల్లో 38 మందిని మక్కువ పీహెచ్‌సీకి తరలించి వైద్యసేవలు అందించారు. మరికొందరు విద్యార్థులకు పాఠశాలలోనే వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. పీహెచ్‌సీలో వైద్యసేవలు పొందుతున్న విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉండడం, ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



దర్యాప్తు నిర్వహిస్తున్న ఇన్‌చార్జి డీఈఓ, డీఎంఅండ్‌హెచ్ఓ

ఉడకని వంటలే కారణం..

పాఠశాలలో 144 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి మధ్యాహ్నభోజనం కింద వెజ్‌బిరియానీ, ఉడికించిన కోడిగుడ్డు, శనగచెక్కి, బంగాళదుంప కుర్మాను భోజన నిర్వాహకురాలు తయారు చేశారు. వెజ్ బిరియానీ వండుతుండగా మధ్యలో గ్యాస్ అయిపోయింది. మరో గ్యాస్ సిలిండర్ తెచ్చి మరోమారు వెజ్‌బిరియానీను ఉడికించి, విద్యార్థులకు వడ్డించారు. అయితే, వెజ్‌బిరియానీ, క్యారెట్, బీట్‌రూట్ సరిగా ఉడకపోవడంతో పాటు, కలుషిత నీరు వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురైనట్టు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. హెచ్ఎం జయకుమార్‌తో వాగ్వాదానికి దిగడంతో ఎస్ఐ పైడిరాజు సముదాయించారు. హెచ్ఎం, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపి నివేదికను డీఈఓకు అందిస్తామని ఇన్‌చార్జి డీఈఓ బ్రహ్మాజీరావు తెలిపారు.

కిమ్మి–రుషింగి మధ్య.. మార్గం సుగమం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో పూర్తయిన వంతెన నిర్మాణం
- రూ.29.5 కోట్ల నాబార్డు నిధులతో పనుల నిర్వహణ
- బుధవారం చివరి శ్లాబు వేసిన అధికారులు
- మార్చి మొదటివారంలో వంతెన ప్రారంభించే అవకాశం



అందుబాటులోకి రానున్న కిమ్మి-రుషింగి వంతెన

వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం– విజయనగరం జిల్లా వంగర మండలాల ప్రజల 11 ఏళ్లుగా ఎదురు చూస్తున్న కిమ్మి–రుషింగి వంతెన నిర్మాణం కొలిక్కి వచ్చింది. వంతెన చివరిశ్లాబు కాంక్రీటు పనులు బుధవారంతో పూర్తయ్యాయి. ఆర్అండ్‌బీ డీఈ గౌరీశ్వరరావు, జేఈ జగన్‌మోహన్‌రాజు పనులను పర్యవేక్షించారు. మార్చి మొదటి వారంతో వంతెన ప్రారంభించే అవకాశం ఉందని అధికారులు చెప్పడంతో ఈ ప్రాంతీయులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

ప్రభుత్వం చొరవతో...

నాగావళి నదిలో కిమ్మి–రుషింగి గ్రామాల మధ్య 2008లో జరిగిన పడవ ప్రమాదం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ విషాద ఘటనకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో వంతెన నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చి నిధులు మంజూరుచేయించారు. వైఎస్సార్ మరణానంతరం సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.29.5 కోట్ల వ్యయంతో 2012లో శ్రీకాకుళం జిల్లా పర్యటనకు వచ్చినపుడు కొత్తూరు మండలంలో రిమోట్‌తో వంతెన పనులకు శంకుస్థాపన చేశారు. పనులు కొన్నాళ్లు జరిగాయి. అయితే, 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం వంతెన నిర్మాణంపై చిత్తశుద్ధి చూపకపోవడంతో కిమ్మి–రుషింగి వంతెన పనుల్లో వేగం తగ్గింది. తర్వాత 2019లో అధికారంలోకి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణంపై దృష్టి సారించడంతో పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేసింది. ఈ మూడున్నరేళ్లలో మిగులు పనులు చేసినప్పటికీ వాతావరణం అనుకూలించకపోవడంతో పనుల్లో జాప్యం జరిగింది. ప్రస్తుతం వాతావరణం బాగుండడంతో చివరి దశలో ఉన్న పనులను పూర్తిచేసింది.



కిమ్మి-రుషింగి వంతెన చివరి శ్లాబు పనులు



వంతెన చివరి శ్లాబు పనులను పర్యవేక్షిస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు

రీ సర్వే పక్కాగా నిర్వహించాలి

- జాయింట్ కలెక్టర్ ఆనంద్



సమావేశంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ ఆనంద్

పార్వతీపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే పక్కాగా నిర్వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ కోరారు. రీ సర్వేకు సంబంధించి ప్రతి మండలానికి ప్రత్యేకంగా నియమించిన డిప్యూటీ తహసీల్దార్లకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు వంద సంవత్సరాల తరువాత ఇప్పుడు భూముల సర్వే జరుగుతోందని, ఇప్పుడు తయారు చేసిన సర్వేరికార్డులే రానున్న వంద సంవత్సరాలకు ప్రామాణికమని తెలిపారు. కావున పక్కాగా సర్వే నిర్వహించి సాగుదారులకు తప్పులులేని భూ హక్కు పత్రాలను అందించాలని సూచించారు.

ప్రభుత్వ భూములు కూడా నమోదు చేయాలి

సర్వేకు సంబంధించి ప్రాథమికంగా తయారు చేసే రికార్డులే కీలకమని, ఫీల్డ్‌లో భూమిపై సాగులో ఉన్నవారి వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. మ్యుటేషన్, పంపకాలు మొదలైనవి ప్రాథమిక దశలోనే పూర్తిచేస్తే పని సులభతరమవుతుందని, తరువాత కరెక్షన్స్‌కు అవకాశం ఉండదన్నారు. మొదటి దశలో విలేజి, హ్యాబిటేషన్ సరిహద్దులు గుర్తించాలని, అదేవిధంగా ప్రభుత్వ భూములకు కూడా సరిహద్దులను గుర్తించి, వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. సర్వే జరిగే విధానంపై అవగాహన కల్పించి, డిప్యూటీ తహసీల్దార్లు వెలిబుచ్చిన సందేహాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐసీఈ డివిజినల్ మేనేజర్ మూర్తి, సూపరింటెండెంట్ రవికుమార్, డీఐఓ రామకృష్ణ, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం, డోర్ నెం.8-30-19, సాయినగర్, తోటపాలెం, విజయనగరం జిల్లా - 535 002

ప్రజాభిప్రాయ సేకరణ

భారత ప్రభుత్వ పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వశాఖ పర్యావరణ చట్టం 1986 క్రింద విడుదల చేసిన ఇ.ఐ.ఎ. నోటిఫికేషన్ ఎస్.ఒ.నెం.1533, తే.14-09-2006 ది మరియు తదుపరి సర్క్యులర్స్ ప్రకారం మెస్సర్స్ తనుశ్రీ మైన్స్ మరియు మినరల్స్, (క్వార్ట్జైట్) (24.631 హెక్టార్లు) వారు రూ. 32.0 లక్షలతో సాలీన క్వార్ట్జైట్- 2,00,309 మెట్రిక్ టన్నులు త్రవ్వటకు ప్రతిపాదించిన ప్రాజెక్టు (క్వార్ట్జైట్)ను 24.631 హెక్టార్లలో సర్వే నెం. 11(పి), మర్రివలస (గ్రామం), మరడాం (పంచాయతీ), దత్తిరాజేరు మండలం, విజయనగరం జిల్లాలో ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించుట గురించి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, విజయనగరం జిల్లా వారు జారీచేయు ప్రకటన.

ప్రాజెక్టు వివరములు క్రింది విధంగా ఉన్నవి :

1.	సంస్థ పేరు మరియు చిరునామా	మెస్సర్స్ తనుశ్రీ మైన్స్ మరియు మినరల్స్ (24.631 హెక్టార్లు), సర్వే నెం. 11(పి), మర్రివలస (గ్రామం), మరడాం (పంచాయతీ), దత్తిరాజేరు మండలం, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్.
2.	ప్రాజెక్టు స్థలం	సర్వే నెం. 11(పి), మర్రివలస (గ్రామం), మరడాం (పంచాయతీ), దత్తిరాజేరు మండలం, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్.
3.	అధీకృత వ్యక్తి పేరు, చిరునామా మరియు చరవాణి సంఖ్య	శ్రీ సత్తి వెంకటరెడ్డి, మేనేజింగ్ పార్టనర్, డోర్ నెం. 8-56, తురుపేట, రామవరం, అనపర్తి మండలం, తూర్పుగోదావరి జిల్లా. ఫోన్ నెం. 9502374777, E-mail: sathishreddy4777.dr@gmail.com
4.	ప్రాజెక్టు విలువ	రూ. 32.0 లక్షలు
5.	ఉత్పత్తి వివరములు	సాలీన క్వార్ట్జైట్ -2,00,309 మెట్రిక్ టన్నులు
6.	తేది, సమయం మరియు జరుగుస్థలం	**తేది: 10-03-2023 (శుక్రవారం), సమయం - మధ్యాహ్నం 2.00 గం॥లకు. స్థలం: మరడాం సచివాలయం దగ్గర, మరడాం, విజయనగరం జిల్లా.**

7. ప్రాజెక్టు కార్యనిర్వాహక సమాచారం, ప్రాజెక్టు పర్యావరణ ప్రభావ అంచనా మరియు కార్యాచరణ ప్రణాళిక నివేదిక మరియు (సాఫ్ట్ కాపీలు) ప్రజలు చూచుటకు అందుబాటులో ఉంచబడిన ప్రదేశములు: 1) జిల్లా కలెక్టరు వారి కార్యాలయం, విజయనగరం. 2) జిల్లా రెవెన్యూ ఆఫీసర్ వారి కార్యాలయం, విజయనగరం. 3) జిల్లా రెవెన్యూ డివిజినల్ అధికారి వారి కార్యాలయం, విజయనగరం. 4) ముఖ్య కార్యనిర్వాహణాధికారి వారి కార్యాలయం, జిల్లా పరిషత్, విజయనగరం. 5) జిల్లా పరిశ్రమల శాఖ, ఇండస్ట్రీయల్ ఎస్టేట్, విజయనగరం. 6) సభ్యకార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, సన్‌రైజ్ హాస్పిటల్ దరి, పుష్ప హోటల్ సెంటర్, చలమవారివీధి, కస్తూరిభాయి పేట, విజయవాడ-520010. 7) జోనల్ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ఉడా లేఅవుట్, మాధవధార, విశాఖపట్నం. 8) డిప్యూటి డైరెక్టర్ (యస్), పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ కార్యాలయం మరియు క్లైమేట్ ఛేంజ్, భారత ప్రభుత్వం, సమీకృత ప్రాంతీయ కార్యాలయం, గ్రీన్ హౌస్ కాంప్లెక్స్, గోపాల్‌రెడ్డి రోడ్, విజయవాడ-520010, ఆంధ్రప్రదేశ్. 9) స్టేట్ లెవల్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ (ఎస్.ఇ.ఐ.ఎ.ఎ.) వారి కార్యాలయం, డోర్ నెం. 33-26-14డి/2, సన్‌రైజ్ హాస్పిటల్ దరి, పుష్ప హోటల్ సెంటర్, చలమవారివీధి, కస్తూరిభాయి పేట, విజయవాడ -520010. 10) అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ మైన్సు వారి కార్యాలయం, విజయనగరం. 11) తహశీల్దార్ కార్యాలయం, దత్తిరాజేరు మండలం, విజయనగరం. 12) గ్రామ పంచాయితీ కార్యాలయం, మర్రివలస (గ్రామం), మరడాం (పంచాయతీ), దత్తిరాజేరు మండలం, విజయనగరం. 13) ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, డోర్‌నెం. 8-30-19, సాయినగర్, తోటపాలెం, విజయనగరం జిల్లా.

పై తెలియజేసిన ప్రాజెక్టుకు సంబంధించి ఏమైనా సూచనలు, సలహాలు, అభిప్రాయాలు మరియు అభ్యంతరములు ఉన్న యెడల **తే: 10.03.2023** దిన గాని, దానికి ముందుగా గాని ఈ క్రింది సంతకము చేసిన అధికారి వారికి లిఖిత పూర్వకముగా పంపించవచ్చును. మరియు పైన సూచించిన తేది మరియు ప్రదేశము వద్ద ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో పాల్గొని గానీ తెలియజేయవచ్చు.

సం/- (పర్యావరణ ఇంజనీర్)
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి,
ప్రాంతీయ కార్యాలయం, విజయనగరం.

స్థలం : విజయనగరం.
తేది : 09-02-2023

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం, డోర్ నెం.8-30-19, సాయినగర్, తోటపాలెం, విజయనగరం జిల్లా - 535 002

ప్రజాభిప్రాయ సేకరణ

భారత ప్రభుత్వ పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వశాఖ పర్యావరణ చట్టం 1986 క్రింద విడుదల చేసిన ఇ.ఐ.ఎ. నోటిఫికేషన్ ఎస్.ఒ.నెం.1533, తే.14-09-2006 ది మరియు తదుపరి సర్క్యులర్స్ ప్రకారం మెస్సర్స్ రోహిత్ మైన్స్ మరియు మినరల్స్, (క్వార్ట్జైట్) (11.835 హెక్టార్లు) వారు రూ. 29.50 లక్షలతో సాలీన క్వార్ట్జైట్- 1,41,974.4 మెట్రిక్ టన్నులు త్రవ్వటకు ప్రతిపాదించిన ప్రాజెక్టు (క్వార్ట్జైట్)ను 11.835 హెక్టార్లలో సర్వే నెం. 1(పి), చినమేడపల్లి (గ్రామం), కుంతినవలస (పంచాయతీ), మెంటాడ మండలం, విజయనగరం జిల్లాలో ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించుట గురించి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, విజయనగరం జిల్లా వారు జారీచేయు ప్రకటన.

ప్రాజెక్టు వివరములు క్రింది విధంగా ఉన్నవి :

1.	సంస్థ పేరు మరియు చిరునామా	మెస్సర్స్ రోహిత్ మైన్స్ మరియు మినరల్స్, (11.835 హెక్టార్లు) సర్వే నెం. 1(పి), చినమేడపల్లి (గ్రామం), కుంతినవలస (పంచాయతీ), మెంటాడ మండలం, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్.
2.	ప్రాజెక్టు స్థలం	సర్వే నెం. 1(పి), చినమేడపల్లి (గ్రామం), కుంతినవలస (పంచాయతీ), మెంటాడ మండలం, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్.
3.	అధీకృత వ్యక్తి పేరు, చిరునామా మరియు చరవాణి సంఖ్య	శ్రీ అలపాటి బాలమురళీకృష్ణ, ప్రొప్రయిటర్, డోర్ నెం. 9-6-47/1, జి1, శ్రీరాజేశ్వరి ఎన్‌క్లేవ్, శివాజీ పాలెం, విశాఖపట్నం. ఫోన్ నెం. 9966993228, E-mail: hemanth@hotmail.com
4.	ప్రాజెక్టు విలువ	రూ. 29.50 లక్షలు
5.	ఉత్పత్తి వివరములు	సాలీన క్వార్ట్జైట్ -1,41,974.4 మెట్రిక్ టన్నులు
6.	తేది, సమయం మరియు జరుగుస్థలం	**తేది: 10-03-2023 (శుక్రవారం), సమయం - ఉదయం 10.30 గం॥లకు. స్థలం: కుంతినవలస సచివాలయం, కుంతినవలస (గ్రామం), విజయనగరం జిల్లా.**

7. ప్రాజెక్టు కార్యనిర్వాహక సమాచారం, ప్రాజెక్టు పర్యావరణ ప్రభావ అంచనా మరియు కార్యాచరణ ప్రణాళిక నివేదిక మరియు (సాఫ్ట్ కాపీలు) ప్రజలు చూచుటకు అందుబాటులో ఉంచబడిన ప్రదేశములు: 1) జిల్లా కలెక్టరు వారి కార్యాలయం, విజయనగరం. 2) జిల్లా రెవెన్యూ ఆఫీసర్ వారి కార్యాలయం, విజయనగరం. 3) జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం,బొబ్బిలి, విజయనగరం. 4) ముఖ్య కార్యనిర్వాహణాధికారి వారి కార్యాలయం, జిల్లా పరిషత్, విజయనగరం. 5) జిల్లా పరిశ్రమల శాఖ, ఇండస్ట్రీయల్ ఎస్టేట్, విజయనగరం. 6) సభ్యకార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, సన్‌రైజ్ హాస్పిటల్ దరి, పుష్ప హోటల్ సెంటర్, చలమవారివీధి, కస్తూరిభాయి పేట, విజయవాడ- 520010. 7) జోనల్ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ఉడా లేఅవుట్, మాధవధార, విశాఖపట్నం. 8) డిప్యూటి డైరెక్టర్ (యస్), పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ కార్యాలయం మరియు క్లైమేట్ ఛేంజ్, భారత ప్రభుత్వం, సమీకృత ప్రాంతీయ కార్యాలయం, గ్రీన్ హౌస్ కాంప్లెక్స్, గోపాల్‌రెడ్డి రోడ్, విజయవాడ-520010, ఆంధ్రప్రదేశ్. 9) స్టేట్ లెవల్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ (ఎస్.ఇ.ఐ.ఎ.ఎ.) వారి కార్యాలయం, డోర్ నెం. 33-26-14డి/2, సన్‌రైజ్ హాస్పిటల్ దరి, పుష్ప హోటల్ సెంటర్, చలమవారివీధి, కస్తూరిభాయి పేట, విజయవాడ -520010. 10) అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ మైన్సు వారి కార్యాలయం, విజయనగరం. 11) తహశీల్దార్ కార్యాలయం, మెంటాడ మండలం, విజయనగరం జిల్లా. 12) గ్రామ పంచాయితీ కార్యాలయం, చినమేడపల్లి (గ్రామం), కుంతినవలస (పంచాయతీ), మెంటాడ మండలం, విజయనగరం జిల్లా. 13) ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, డోర్‌నెం. 8-30-19, సాయినగర్, తోటపాలెం, విజయనగరం జిల్లా.

పై తెలియజేసిన ప్రాజెక్టుకు సంబంధించి ఏమైనా సూచనలు, సలహాలు, అభిప్రాయాలు మరియు అభ్యంతరములు ఉన్న యెడల **తే: 10.03.2023** దిన గాని, దానికి ముందుగా గాని ఈ క్రింది సంతకము చేసిన అధికారి వారికి లిఖిత పూర్వకముగా పంపించవచ్చును. మరియు పైన సూచించిన తేది మరియు ప్రదేశము వద్ద ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో పాల్గొని గానీ తెలియజేయవచ్చు.

సం/- (పర్యావరణ ఇంజనీర్)
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి,
ప్రాంతీయ కార్యాలయం, విజయనగరం.

స్థలం : విజయనగరం.
తేది : 09-02-2023

ఎగ్‌వేత కుదరదిక..!

అంగన్వాడీ కేంద్రాల ద్వారా కోడిగుడ్ల పంపిణీ ఒకప్పుడు అవకతవకలకు కేంద్ర బిందువుగా ఉండేది. హాజరు శాతం పెంచి చూపించి కొన్నిచోట్ల గుడ్లు మింగేసేవారు. గుడ్లు కేంద్రానికి చేరకుండా మధ్యలోనే దారి మళ్లించి మార్కెట్లో అమ్మేసేవారు. పెద్ద సైజు గుడ్లను మార్కెట్లో అమ్మేసి చిన్న సైజు గుడ్లను సెంటర్లలో పంపిణీ చేసేవారు. పంపిణీలో అవకతవకల వల్ల నాణ్యతా లోపంతో గుడ్లు చెడిపోయేవి. అటువంటి పరిస్థితులకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్య సత్ఫలితానిస్తోంది.

- పార్వతీపురం టౌన్

- కోడిగుడ్లపై స్టాంపింగ్‌తో అవకతవకలకు తెర
- అంగన్‌వాడీ కేంద్రాల్లో సజావుగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ అమలు
- మన్యం జిల్లాలో 11 ఐసీడీఎస్ ప్రాజెక్టులు
- 2,064 అంగన్వాడీ కేంద్రాల పరిధిలో 15,601 మందికి లబ్ధి



గుడ్లుతింటున్న పిల్లలు (ఫైల్)



స్టాంపింగ్‌తో ఐసీడీఎస్ గుడ్లు



అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, ఆరు నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు, 3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలకు ప్రతి నెలా సుమారు 25 గుడ్లను వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా అందిస్తోంది. 6 నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు ప్రతి 15 రోజులకు ఒకసారి ఇంటికి గుడ్లను అందిస్తారు. మిగిలిన వారందరికీ అంగన్వాడీ కేంద్రాల్లో ఉడకబెట్టి పంపిణీ చేస్తారు. ఈ గుడ్లలో నాలుగు నుంచి ఆరు శాతం దారి మళ్లించడమో పాడైపోవడమో గతంలో జరిగేది. దీన్ని నివారించేందుకు ప్రభుత్వం వినూత్నంగా చర్యలు చేపట్టింది. నెలను మూడు భాగాలుగా విభజించింది. మొదటి 10 రోజులూ సరఫరా చేసే గుడ్లపై ఒక రంగు, తరువాత 10 రోజులకు మరో రంగు, మిగిలిన 10 రోజులకు వేరే రంగు చుక్కలు పెట్టి పంపిణీ చేసేది. అయితే అక్రమార్కులు పది నిమిషాల పాటు ఆ కోడిగుడ్లను నీళ్లలో నానబెట్టి గుడ్డుపై ముద్రించిన గుర్తులను తుడిచేసి చెరిపేసేవారు. తరువాత ఆ గుడ్లను హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వచ్చాయి. అవకతవకల నివారణకు తీసుకున్న ఈ చర్యల వల్ల కూడా అంతగా ఆశించిన స్థాయిలో ప్రయోజనం కనిపించలేదు.

స్టాంపింగ్‌తో సత్ఫలితాలు

ఈ పరిస్థితులను పూర్తిగా చక్కదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ గుర్తు చెరిగిపోని విధంగా కోడిగుడ్లపై స్టాంప్ వేసే విధానాన్ని తాజాగా తీసుకువచ్చింది. పార్వతీపురం మన్యం జిల్లాలో అమలు చేస్తున్న ఈ విధానం క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలు ఇస్తోందని అధికార యంత్రాంగాలు గుర్తించాయి. ఈ గుర్తు కారణంగా మార్కెట్లో అంగన్వాడీ గుడ్లను దొడ్డిదారిన అమ్ముకునే పరిస్థితులకు చెక్ పడింది. నిర్దేశించిన గుర్తు ముద్రించిన తరువాతే వాటిని అంగన్వాడీ కేంద్రాలకు పంపిణీ చేస్తున్నారు. ఈ మార్పు సత్ఫలితాలను ఇస్తోందని చెబుతున్నారు.

జిల్లాలో ఐసీడీఎస్‌ల వివరాలు..	
మండలాలు	15
ఐసీడీఎస్ ప్రాజెక్టులు	11
అంగన్వాడీ కేంద్రాలు	1425
మినీ అంగన్వాడీ కేంద్రాలు	639
గర్భిణులు	7335
బాలింతలు	8266
6 నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలు	28310మంది
3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలు	63557మంది

అక్రమాలకు ఆస్కారం ఉండదు



అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి లబ్ధిదారుకూ గుడ్లు అందించాలని ఆదేశించాం. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతో రక్తహీనత నుంచి రక్షణ లభిస్తుంది. పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల్లో కోడిగుడ్డుకు ప్రత్యేక స్థానం ఉంది. చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు ఉడికించిన కోడిగుడ్డు ఇస్తున్నాం. నిల్వ గుడ్లకు ఆస్కారం లేకుండా ప్రతి 10 రోజులకు ఒక రంగుతో కూడిన గుడ్లను సరఫరా చేస్తున్నాం. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ముద్రతో గుడ్లు సరఫరా చేయడం వల్ల అక్రమాలకు అవకాశం లేదు.

– కె. విజయగౌరి, ఇన్‌చార్జి జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి, పార్వతీపురం మన్యం

నిల్వ గుడ్లు గుర్తించే అవకాశం



అంగన్వాడీ కేంద్రాలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద అందించే గుడ్లకు మూడు రంగుల్లో కలర్ కోడింగ్ ఇవ్వడం శుభపరిణామం. తద్వారా గుడ్లు దుర్వినియోగం కావు. నిల్వ గుడ్లు అయితే కలర్‌ను బట్టి గుర్తించే అవకాశం ఉంటుంది.

–పళ్ల కృష్ణవేణి, అంగన్వాడీ కార్యకర్త, గురుగుబిల్లి

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



రైలు ప్రమాదంలో మృతిచెందిన సురేష్

విజయనగరం క్రైమ్: తల్లిని రైలులోని వాష్‌రూమ్‌కు తీసుకెళ్లి, అక్కడ అద్దం వద్ద నిల్చున్న వ్యక్తి రైలు ధాటికి తూలిపోయి ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు. దీనికి సంబంధించి జీఆర్‌పీ ఎస్సై రవివర్మ బుధవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. డొంకినవలసకు చెందిన చింతల సురేష్ (32) మహారాష్ట్రలో కూలిపనులు చేస్తుంటాడు. డొంకినవలస నుంచి తల్లిని హైదరాబాద్‌లో ఉన్న బంధువుల ఇంటికి తీసుకువెళ్లి, అక్కడినుంచి తాను మహారాష్ట్రకు వెళ్లి పనులు చేసుకుందామని నిశ్చయించుకుని రాయపూర్-విశాఖ ప్యాసింజర్ రైలు మంగళవారం సాయంత్రం ఎక్కాడు. గుండాపేట ప్రాంతం వద్దకు వచ్చేసరికి తల్లి వాష్‌రూమ్‌కి వెళ్లింది. ఆమెకు తోడుగా వచ్చిన సురేష్ డోర్ వద్ద నిల్చున్నాడు. ఆ ప్రాంతంలో డీప్ కర్వ్ ఉండడంతో రైలు తిరిగే సమయంలో ఆ ధాటికి సురేష్ ప్రమాదవశాత్తు జారి కింద పడి మృతిచెందాడు. సురేష్ తండ్రి కూడా గతంలో రైలు ప్రమాదంలోనే మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై రవివర్మ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి

- మరొకరికి గాయాలు



రోడ్డుపై మృతదేహం, క్షతగాత్రుడు

పార్వతీపురం: పట్టణంలోని ఫ్లై ఓవర్ సమీపంలో బుధవారం సాయంత్రం రెండు బైక్‌లు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి జిల్లా ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సెల్‌ఫోన్ పోయిందని పార్వతీపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు నవిరి కాలనీనుంచి ఆర్‌టీసీ కాంప్లెక్స్ వైపు ద్విచక్ర వాహనంపై మండంగి నేతాజీ, మండంగి రమేష్‌లు వెళ్తున్నారు. ఫ్లై ఓవర్ సమీపంలో ఆర్‌టీసీ కాంప్లెక్స్ నుంచి కొత్తవలసవైపు వెళ్తున్న మరో బైక్ వారిని బలంగా ఢీ కొట్టడంతో ఇద్దరూ రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు. ఈ ఘటనలో మండంగి నేతాజీ(30) సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మండంగి రమేష్ కాళ్లు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం, చికిత్స కోసం క్షతగాత్రుడిని 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్టు



దోపిడీ కేసులో నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు, (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: వేర్వేరు కేసుల్లో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పూసపాటిరేగకు చెందిన రౌతు వెంకటలక్ష్మి ఈ నెల 6న పీడబ్ల్యూ మార్కెట్‌లో సామగ్రి కొనుగోలు చేసి సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఆటో ఎక్కేందుకు ఎంఆర్ కళాశాల దగ్గర్లోకి వచ్చే సరికి ఆమె మెడలోని రోల్డ్‌గోల్డ్ చైన్, పర్స్ లాక్కుని ఒక మహిళ పరారైంది. ఆ పర్స్‌లో 8 తులాల వెండిపట్టీలు, రూ.5వేలు నగదు ఉన్నాయని బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదుచేయగా రంగంలోకి దిగిన పోలీసులు బుధవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో సున్నంబట్టివీధి వద్ద ఎల్.కోట మండలం రంగాపురం గ్రామానికి చెందిన దాసు ఏసుమణిని అదుపులోకి తీసుకున్నారు. ఆమె దగ్గర నుంచి రోల్డ్‌గోల్డ్ చైన్, 8 తులాల పట్టీలు, రూ.4వేలు నగదు రికవరీ చేసి, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రెండేళ్ల క్రితం దోపిడీ కేసులో ఒక నిందితుడు..

2021 జనవరి 23న రాత్రి 11 గంటల ప్రాంతంలో విజయనగరం బార్ అండ్ రెస్టారెంట్ యజమాని రాధాకృష్ణ వరప్రసాద్ తన బార్‌లో కలెక్షన్ డబ్బులు రూ.లక్షా 60వేల 620 నగదు బైక్ కవర్‌లో పెట్టుకుని వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు అతన్ని కొట్టి నగదు పట్టుకుపోయినట్లు బాధితుడు రిపోర్ట్ ఇచ్చాడు. ఈ నేపథ్యంలో పాత కేసులపై దృష్టిసారించి నిఘాపెట్టి బుధవారం మధ్యాహ్నం బొండాడ వీధి జంక్షన్‌లో ముత్యాల ప్రసాద్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో ఆ నేరం చేసింది తానేనని అంగీకరించాడు. దీంతో నిందితుడి నుంచి ఒక వాచీ, వెండిచైన్ సీజ్ చేసి అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడిపై నిఘా పెట్టామని సీఐ వెంకటరావు తెలియజేశారు.

ఆటో బోల్తా పడి ఆరుగురికి గాయాలు

బొబ్బిలి రూరల్: మండలంలోని కోమటిపల్లి వద్ద బుధవారం ప్రయాణికులతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి పంటపొలాల్లో పడిపోవడంతో డ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు గాయపడ్డారు. క్షతగాత్రులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బొబ్బిలిలో జరిగే ఓ శుభకార్యంలో పాల్గొనేందుకు లచ్చయ్యపేట గ్రామానికి చెందిన రవికుమార్ ఆటోలో అదే గ్రామం నుంచి యజ్జల పుష్పమ్మ, యందవ పుష్పమ్మ, వై.మనోహర్, చిన్నమ్మి, తౌడమ్మలు బొబ్బిలి వెళ్తున్నారు. మార్గమధ్యంలో కోమటిపల్లి వద్ద ఆటో అదుపుతప్పి పంట పొలాల్లో పడడంతో వారంతా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించగా వైద్యులు ప్రథమచికిత్స చేశారు. తీవ్రంగా గాయపడిన ఆటోడ్రైవర్ రవికుమార్, యజ్జల పుష్పమ్మలను మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



క్షతగాత్రులను తరలిస్తున్న 108సిబ్బంది

బీసీల అభ్యున్నతికి కృషి చేస్తా

- జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు
- నియామక పత్రం అందజేసిన రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న నడిపేన శ్రీనివాసరావు

విజయనగరం: బీసీల అభ్యున్నతికి, పటిష్టానికి తన వంతు కృషి చేస్తానని నూతనంగా నియమితులైన విజయనగరం జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన న్యూఢిల్లీలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా విజయనగరం జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్యకు శాలువా కప్పి కృతజ్ఞతలు తెలియజేశారు. బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మారేశ్, కన్వీనర్ పితాని ప్రసాద్, పలువురు బీసీ సంఘం నేతలు నూతనంగా నియమితులైన విజయనగరం జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావుకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నడిపేన శ్రీనివాసరావు మాట్లాడుతూ తనకు పదవి రావడం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, శాసన సభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతి అని, తన పాదయాత్రలో బీసీలకు అన్ని విధాలా న్యాయం చేస్తానని ఇచ్చిన హామీలకు అనుగుణంగా అధికారం చేపట్టిన తర్వాత బీసీలకు ప్రాధాన్యం ఇచ్చే అనేక కార్యక్రమాలు చేపట్టారని సంతోషం వెలిబుచ్చారు. జిల్లా వ్యాప్తంగా త్వరలోనే పర్యటించి బీసీలందరినీ ఏకతాటిపైకి తెచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అండగా ఉండేలా కృషి చేస్తానన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹ 190